కథ

# తెర తీయగరాదా...

-ఆసం శ్రీనివాస్

మంచివాడు - చెడ్డవాడులోంచి...

మంచి చెడ్డ తీసేస్తే - వాడు రెంటికీ చెందినవాడు!

మైనపు ముద్దలాంటి మనసుని అవసరాన్నిబట్టి మలచుకునేవాడు!

వేడికి మైనం కరుగుతుంది... పెళ్ళాం పట్టుచీరెలకు కరుగుతుంది... కొడుకు చాక్లెట్లకు కరుగుతాడు... దేవుడు కానుకలకు కరుగుతాడు... లాంటి జీవితసత్యాలు పరిశోధించి తెలుసుకున్న మహామేధావి!

'మేధ లేనివాడయినా మేధావి కాగలడు.

వేదం చదవని వాడయినా వేదాంతి కాగలడు.

భాగ్యం అనుభవించే వాడయినా వైరాగ్యం బోధించగలడు.

రక్తి ఉన్నవాడయినా భక్తి మార్గం అనుసరించగలడు'

ఇవన్నీ అవసరమైనప్పుడు తిన్నగానూ... లేదే, రివర్స్‌గానూ తనను తాను సమర్థించుకోవడం కోసం ప్రయోగించగలడు!

కానీ, 'కాలం' సదరు మేధావికన్నా నాలుగాకులు ఎక్కువే చదువుకుంది.

అందుకే ఈడ్చి నాలుగంటించినట్టు బుద్ధి చెప్పి మరీ వదిలింది.

అతనికప్పుడో కొత్త సూత్రం అర్థమైంది...

'మేధ లేనివాడు మేధావి కాలేడు!' అని.

★★★

కారు నెమ్మదిగా సాగిపోతోంది... బరువైన మనసుని భారంగా ఈడ్చుకుపోతున్నట్టు!

పచ్చటి ఆకు మధ్య ఈనెలా - ఆ చిట్టడవి మధ్య రోడ్డు దారి చూపుతోంది!

మేధావి ఫుల్‌సూట్‌లో మెరిసిపోతూ కారు డ్రైవ్ చేస్తున్నాడు. అతని పక్కనే మిసెస్ మేధావి అలియాస్ కుసుమ కూర్చుని... ఒళ్ళో పడుకున్న జూనియర్ మేధావి ఉరఫ్ కిట్టూని జోకొడుతోంది.

కారు ఇంజన్ తాలూకు శబ్దం కూడా ఆమెకి నిశ్శబ్దంగానే వినిపిస్తోంది. స్తబ్దతలో శబ్దం ఉండదు - నిశ్శబ్దం తప్ప! శబ్దం ప్రారంభమైతే నిశ్శబ్దమే ఉండదు - ఎద రొద తప్ప!

కుసుమ తల తిప్పి మేధావి వేపు చూసింది. ఆమెకు అడుగు దూరంలో కూర్చుని, సగటు మనిషి సంస్కారాన్ని తోసుకెళ్తున్నంత చాకచక్యంగా - 'డ్రయివ్' చేస్తున్నాడు.

కోటేరులాంటి ముక్కు... కింద వత్తయిన మీసం... పసిమి ఛాయలో ఆరోగ్యంగా మెరిసిపోతున్న చెంపలు... విశాలమైన భుజాలు... ఎత్తయిన వక్షస్థలం... అందానికి సరయిన నిర్వచనం అతను! (మానసిక సౌందర్యాన్ని లెక్కలోకి తీసుకోకుండా ఉండి వుంటే!)

అతన్నే తదేకంగా చూస్తున్న కుసుమ మనసులో ఉదయించిందో ప్రశ్న... ఎప్పుడూ ఉదయించే ప్రశ్న! 'ఇంత అందమైన మనిషికి అందమైన మనసెందుకు లేదు?'

హు... కొన్ని ప్రశ్నలు వృత్తంలాంటివి. పుట్టిన చోటు నుండి చుట్టూ గిరికీలు కొట్టి - తిరిగి పుట్టిన చోటుకే చేరి ఆగిపోతాయ్ - సమాధానం దొరక్క!

ఈ ప్రశ్న కూడా అంతే!

ఆమె నిట్టూర్చి, తలతిప్పి కిటికీలోంచి బయటకు చూడసాగింది. భౌతికానికీ... మానసికానికీ చాలా తేడా ఉంది. అనుభవానికీ... అనుభూతికీ ఉన్నంత తేడా! భౌతికంలో అడుగు దూరం - మానసికంలో వేల యోజనాల దూరం! భర్తకీ తనకీ మధ్య అంతే దూరం... అన్న నిజాన్ని ఆమె శోభనం రాత్రే తెలుసుకుంది. (గదిలో అడుగుపెట్టిన అరగంట తర్వాత అతను బిజినెస్ ఫైళ్ళలో తలదూర్చినప్పుడు!)

అనుభూతి లేని కారు అనుభవం కోసం ఆత్రపడే ఆకతాయి కుర్రాడిలా వేగంగా పరుగులెత్తుతోంది. చెట్ల మధ్య అంతరం ఎక్కువైనప్పుడు కారు అద్దాల మీద పడే ఎండ... చెట్లు సమీపించగానే పడే నీడ... చీకటి తరవాత వెలుగుంటుందనే సత్యాన్ని విశదీకరిస్తున్నట్టు ఉంది.

కారు అడవి దాటి ఘాట్‌రోడ్‌లోకి ప్రవేశించింది. దూరంగా కొండ... దాని మధ్యనున్న సమున్నత స్థలంలో శివుడి గుడి గోపురం... మెలికలు తిరిగిన ఘాట్ రోడ్డు...

అంతకు ముందు రోజు రాత్రి భర్త మాటలు గుర్తొచ్చాయామెకు-

'ఈ సంవత్సరం కూడా ఆ కాంట్రాక్టు నాకే వచ్చేలా చేస్తే కొండమీది శివుడికి హుండీలో వెయ్యి రూపాయలు వేస్తాను. నువ్వూ మొక్కుకో!'

హు... భక్తిని బిజినెస్‌తో ముడిపెట్టుకున్న మనిషి - భార్యని కూడా పూజారిణిని చేయడంలో వింతేముంది? కానీ, ఓ పెద్ద మూటని తనకి లభించేలా చేస్తే ఓ చిన్న మూటని లంచంగా ఇస్తానని ఆ దేవుడికి ఆశ పెట్టడానికి వస్తున్న భర్తని చూస్తే ఆమెకి కోపం వచ్చింది.

అయితే, అతని దగ్గర ప్రేమ ప్రదర్శిస్తే తప్పు! కోపం ప్రదర్శిస్తే ముప్పు! అన్నిటికీ బుర్ర ఊపటం ఒక్కటే ఒప్పు!

అందుకే మౌనంగా బయలుదేరింది.

కారు కొండని సమీపించడంతో ఆలోచనని ఆపి కిట్టూని నిద్రలేపింది. కొండ కింది భాగంలో అక్కడక్కడా యాత్రా స్పెషల్ బస్సులు, రకరకాల వాహనాలు ఆగి ఉన్నాయి. మేధావి కూడా ఓ చెట్టు నీడలో కారునాపి కిందికి దిగాడు. కుసుమ కూడా కిట్టూతోపాటు దిగి చుట్టూ చూసింది.



దర్శనం చేసుకుని తిరిగి వస్తున్న భక్తుల ముఖాలన్నీ విబూది రేఖలతో పవిత్రంగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడా చెట్ల మీద కోతులు వాటి ప్రవృత్తిని ప్రదర్శిస్తున్నాయి.

భర్తకారు డోర్స్ లాక్ చేయగానే కిట్టూని తీసుకుని నడక సాగించింది. వర్షానికి మట్టి కొట్టుకుపోయి దాంతా రాళ్ళమయమయి ఉంది. అక్కడక్కడా మెరుస్తూ కనిపించే రాళ్ళని ఏరుకుంటూ జేబులో తోసుకుంటున్నాడు కిట్టూ.

మేధావి... పక్కన నడిచే పసిడిబొమ్మలాంటి భార్యని కాక - పరాయి వాళ్ళ భార్యల ఎత్తువంపుల్ని కనుకొలకుల్లోంచి చూస్తూ నడుస్తున్నాడు.

కొండ ఎత్తు నుంచి పల్లానికి జారటం మొదలయింది. మొదలుకీ, శిఖరాగ్రానికీ మధ్య నుంచి ఆలయం.

కిట్టూ గబగబా కిందికి దిగాలని తల్లిని లాక్కుపోతూ ఓ చోట టక్కున ఆగిపోయాడు. వాడంత హఠాత్తుగా ఎందుకు ఆగాడో తెలీని కుసుమ ఆగి వాడి ముఖంలోకి చూసింది. వాడి చూపు ఓ చోట చిక్కుబడిపోయి ఉంది.

ఎదురుగా ఓ జంట కొడుకు చేతుల్ని అటొకరూ ఇటొకరూ పట్టుకుని, ఆ కుర్రాడితో కబుర్లు చెప్తూ వస్తున్నారు. వాళ్ళు తమని దాటిపోయేవరకూ రెప్పవాల్చకుండా చూస్తూనే ఉన్నాడు కిట్టూ.

'ఏమిటి కన్నా?' అనడిగింది. అర్థంలేని ప్రశ్న. సందర్భం అర్థమైనా అడక్కుండా ఉండలేని ప్రశ్న.

కిట్టూ కళ్ళు నిరాశతో కిందికి వాలిపోయాయి. ఏమీ లేదన్నట్టు తలవూపి తిరిగి నడవసాగాడు. వాడి కళ్ళలోని భావాన్ని చదివి నిస్సహాయంగా నిట్టూర్చింది కుసుమ.

వాడూ తనలాగే తయారవుతున్నాడు.

స్థితిని ప్రజ్ఞతో జయించలేక స్థితప్రజ్ఞుడిలా... మౌనమే జవాబుగా సంధించటం ఆ చిన్ని మనసుకీ అలవడింది.

గుడిని సమీపించాక కుసుమ కిట్టూని తీసుకుని ఆడవాళ్ళు నిలుచున్న క్యూవేపు వెళ్ళబోయింది.

కిట్టూ తల్లి చేయి విడిపించుకుని సీరియస్‌గా చెప్పాడు.-

'నేను మగవాణ్ణి! ఆడాళ్ళ వరసలో నిలబడను'

ఆమెకి చప్పున నవ్వొచ్చింది. కొడుకుని భర్త చేతి కందించి, ఆమె వెళ్ళిపోయింది. మేధావి కిట్టూని తీసుకుని మగవాళ్ళ వరసలో నిలబడ్డాడు.

పద్మవ్యూహంలా వెదురుకర్రలతో కట్టిన పార్టీషన్ దారి జనానికి సరిపోలేదు. మిగతా వాళ్ళంతా ఎండలో పాములా మెలికలు తిరిగిన వరసలో నిలబడ్డారు.

మధ్యందిన భానుడు - భక్తివల్ల కాకుండా అవసరం వల్ల వచ్చే భక్తుల్ని చూసి ఆగ్రహిస్తున్నట్టు చండ్ర నిప్పులు చెరుగుతున్నాడు. జుట్టులోంచి నుదుటి మీదకు జారే చెమట బొట్లు - మున్సిపాలిటీ కుళాయిలోంచి వచ్చే చుక్కల్లా ముక్కుమీద క్షణమాగి, పెదవుల మీద పడుతున్నాయి.

మేధావికి చిరాకు ఎక్కువయింది. తన హోదా, అంతస్తు మరచి అలగా జనంతో (?) కలిసి నించోవాలంటే కంపరంగా ఉంది. సహనానికి పరీక్షలా మరో పక్క ఎండ! అసహనం ముఖ ముద్రయింది!

ఇంతలో కిట్టూ 'డాడీ... దాహం!' అన్నాడు.

చాచి ఒక్కటివ్వాలన్న కోరికను బలవంతంగా నిగ్రహించుకున్నాడతను. నోట్లో పట్టకపోవటం వల్ల బతికిపోయాడు గానీ, లేకుంటే అమాంతం మింగేసేవాడు. అలాంటి ఓ చూపు విసిరి చుట్టూ చూశాడు మేధావి!

దూరంగా తాటాకులు కప్పిన ఓ టీ బంకు కనిపించింది.

'రా' విసురుగా అని, కొడుకుని తీసుకుని అటుకేసి నడిచాడు.

బంకులో ఓ అమ్మాయి ఉంది. దాచుకోవాల్సిన స్థలాలు బయటపెట్టి, బయటికి కనిపించాల్సిన స్థలాలు బట్టల్లో దాచుకుని, తేనీటి విందుతోపాటు కనువిందూ చేస్తోంది.

మేధావి పసందుగా కనిపించే అందాల్ని కళ్ళజోడు సందులోంచి చూడనే చూశాడు. ఆమె పొందు కావాలనుకున్నాడు. సందు చూసుకుని డబ్బుతోపాటు కోరికనీ ముందుంచాడు.

ఆమె అటూ ఇటూ చూసింది. కస్టమర్స్ ఎవరూ లేరు-

'ఈడ వొద్దు! దేవుడు తంతాడు! రేపు నువ్వేడకి రమ్మంటే ఆడకొత్తా!' అంది.

'కనీసం ఒక్క ముద్దు...'

'ఆగనేక పోతన్నావే?! తడికె సాటుకి రా!' చెప్పి వెళ్ళింది నవ్వుతూ!

అతను అటూ ఇటూ చూసి, కిట్టూని బెంచీమీద కూర్చోబెట్టి, ఓ బిస్కట్ పాకెట్ చేతికిచ్చాడు.

తరవాత తడక చాటుకి వెళ్ళాడు.

అలగా జనం పక్కన నిలబడటానికి చిరాకు పడ్డ అతని హోదా - అలగా మనిషి ముద్దు కోసం ఉనికి పోగొట్టుకుంది.

గుడిలో దేవుడు... గుడి ముందు అమాయకమైన కుసుమ ప్రార్థన... గుడిసె ముందు పసిహృదయం... తడక వెనక తమకంలో మునిగిన శరీరం... అంతా కలిపి ఓ గొలుసుకట్టు కథ!

నేపథ్యంలో విషాదం... సమక్షంలో విహారం... సమస్తంలో క్షణికం... క్షణం - క్షణంలోనే అభౌతికం... భౌతికం లిప్తపాటులో అశాశ్వతం...

అంతా మిథ్య! సర్వం జగన్నాథం! జగన్నాథునికి వేయి కళ్ళు!

... రెండు నిమిషాల తరవాత పెదవుల కంటిన మధువుని చప్పరిస్తూ మేధావి - చాటునించి తెర ముందుకొచ్చాడు.

తెర ముందు -

నలిగిపోయి పిండిముద్దలా మారి కింద పడి ఉంది బిస్కట్ పాకెట్!

కిట్టూ అక్కడ లేడు - గుడివేపు వెళ్తూ కనిపించాడు.

అతని కర్థమైంది - కొడుకు చాక్లెట్లకు కరగడు!

★★★

తిరుగు ప్రయాణం అయ్యేసరికి సాయంత్రమైంది.

పక్కపక్కనే కూర్చున్న ముగ్గురు మనుషుల్లో మూడు విభిన్నమైన ప్రవృత్తులు - భిన్నమైన మనసులు!

స్పందించే మనసుకు - ప్రతిస్పందించే సహృదయం లేదన్న హృదయాంతర్గత ఘోష ఆమెలో...

వినిపించని రాగానికి - కనిపించని గుండె మృదంగం - నిలదీసి ప్రశ్నిస్తూ కదన కుతూహలం పాడుతుంటే కదనమైన మథన కథనం అతనిలో...

శైశవంపై పడ్డ వైరాగ్యపు వార్ధక్యం ముద్ర నిద్రలేచి నర్తించిన వైనం కిట్టూలో...

కేవలం ముగ్గురు మనుషులే... మూడు మనసులే!

సమాధానం లేని ప్రశ్నలకు జవాబుదారీ ఎవరో తెలియని - దారి దొరకని అవిశ్రాంత పథచారులే!

కారు మాత్రం ఏ స్పందనా లేకుండా యంత్రంలాగే సాగిపోతోంది!

ఘాట్‌రోడ్డు ప్రయాణం కాబట్టి లేని ఏకాగ్రత బలవంతంగా తెచ్చుకున్నాడతను.

అయినా సరే, ఏకాగ్రత చెదిరింది... స్టీరింగ్ తృటికాలం కంట్రోల్ తప్పింది! కుడివేపు రోడ్డు పక్కనున్న మట్టిబీట మధ్యలో కారు టైరు ఇరుక్కుపోయింది!

చప్పున బ్రేక్ వేశాడతను!

అప్పటికే ఓ మట్టిపెళ్ళ అనంతమైన లోయలోకి దొర్లుకుంటూ జారింది! కారు కొద్దిగా నేలలో దిగబడింది.

కెవ్వున కేకవేసి కిట్టూని గుండెలకు హత్తుకుంది కుసుమ.

అతను వెంటనే కారు ఎడమవేపు డోర్ తెరిచి, 'రోడ్ మీదికి దూకేయండి!' అరిచాడు.

కుసుమ చప్పున కొడుకుని దింపేసి, తనూ వెనకే గాభరాగా దిగి, 'మీరూ వచ్చేయండి!' భయంగా కేకవేస్తున్నట్టు, విహ్వలమైన గొంతుతో అంది.

అతనూ స్టీరింగ్ ముందు నుంచి రోడ్ వేపున డోర్‌వేపు రాబోయాడు.

అప్పటికే కారు సగానికి పైగా లోయలోకి జారింది-

అతను ప్రాణభీతితో చప్పున దూకేశాడు. అయితే ఆ కొద్ది ఆలస్యం అతన్ని మృత్యువు చేరువలోకి నెట్టేసింది-

కారు జారటం... లోయలోకి దొర్లటం... రోడ్ మీదకు దూకబోయిన అతను పట్టుతప్పి రోడ్ అంచు నుంచి లోయలోకి జారబోవడం... క్షణంలో కుసుమ చేయి అతనికి ఆసరా ఇవ్వటం...

'డాడీ! డాడీ!' కొడుకు భయంతో అరిచే అరుపులు!

'ఏవండీ! జాగ్రత్త!' నిస్సహాయంగా (పైకి లాగుతూనే) కుసుమ పెట్టే కేకలు!

అతను జారుతూనే ఉన్నాడు - ఆమె పైకి లాగుతూనే ఉంది - చివరికి -

అతను భార్య చేయి ఆసరాతో పైకి చేరుకుని నిస్సత్తువగా ఆమె మీద వాలిపోయాడు. కొడుకు ఆనందంగా తండ్రి కాళ్ళు కావలించుకున్నాడు.

కారు దొర్లుతున్న శబ్దం ఆగిన మరుక్షణం - పెద్ద విస్ఫోటనం...!

శివుడి మూడోకన్ను తెరుచుకున్నప్పటి బీభత్సం...! భయానకం చెరిగి పొంగి పొర్లిన కరుణరసం...! ఆర్తితో అల్లుకున్న ఆర్తగీతం...!!

అంతా నిశ్శబ్దం!

అతనిలో... ఆమెలో... కిట్టూలో... ప్రకృతిలో... అంతా మంగళ వాయిద్యాల శబ్దం!

భార్య గుండెల మీద అతని తల... అతని గుండెల్లో కొడుకు ఊహ తెలిసినప్పట్నించి కనే కల...

వినిపించెను 'తెర తీయగరాదా...' నేపథ్య కీర్తనం!

అతని కర్థమైంది - భార్య పట్టుచీరలకూ, దేవుడు కానుకలకూ కరిగేంత అల్ప సంతోషులు కాదు - వేడికి మైనం కరిగినట్టు, ప్రేమకు మాత్రమే సృష్టిలో ఏదయినా కరుగుతుంది!... అని!

ఆ అసుర సంధ్యవేళ... ఆనందపు రహదారిపై, ఆత్మీయత పంచుకుంటూ... పడమర నుంచి తూర్పు వెలుగు రేఖలకై వెదుక్కుంటూ ఆ ముగ్గురూ నెమ్మదిగా నడుస్తున్నారు...

స్తబ్దత అంతా కారు తాలూకు విస్ఫోటన శబ్దంతోనే ముక్కలు చెక్కలై నిశ్శబ్దమైంది!

భర్తని మార్చమని అర్థించినందుకు కుసుమకూ-

దైవ సన్నిధిలో భార్యకు ద్రోహం చేసిన పాపభీతితో నలిగిపోయిన అతనికీ-

తప్పుచేసిన తండ్రిని చూసి నిలదీసి ప్రశ్నించలేని, అంత వయసులేని కిట్టూ హృదయభారానికీ-

శివుడు ఆడిన యాక్సిడెంట్ నాటకంతో మనసు తేలికపడింది!

ఇప్పుడు - అంతటా కోయిల కిలకిలా రవములే!

అంతా హర్షాతిరేక సరిగమ పదనిసలే!